# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 198 | బుధవారం | 07 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




8 లో..

## రెజ్లింగ్‌లో విజయకేతనం ఎగురవేయాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



# వేడెక్కుతున్న.. రాజకీయం


## వాడివేడిగా సాగనున్న బడ్జెట్ సమావేశాలు

- అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్న విపక్షాలు
- కాంగ్రెస్ పై ముప్పేట దాడి చేసేందుకు పక్కా ప్లాన్
- రేవంత్‌ను రెచ్చగొట్టి ట్రాప్‌లో పడేసేలా స్కెచ్
- పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా విమర్శనాస్త్రాలు
- రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

రేపటి నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ బడ్జెట్ సమావేశాలు వాడి వేడిగా సాగనున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ సిద్ధపడుతున్న నేపథ్యంలో అసెంబ్లీ సాక్షిగా వారిని ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ నేతలు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే తొలి అసెంబ్లీ సమావేశాల్లో శ్వేతపత్రాలతో గత కేసీఆర్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం తేటతెల్లం చేసింది. ఇప్పుడు మరోమారు కాళేశ్వరం సహా అనేక ప్రాజెక్టుల్లో అవినీతి, ధరణి వంటి సమస్యలను ప్రస్తావించడం ద్వారా బీఆర్ఎస్‌ను ఎండగట్టేందుకు సిద్ధం అవుతోంది. ఈ క్రమంలో కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడంపై బీఆర్ఎస్ ఎదురుదాడికి సిద్ధపడుతోంది. కేసీఆర్ అసెంబ్లీకి హాజరైతే ఈ సమావేశాలు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. అయితే విపక్షం రేవంత్‌ను రెచ్చగొట్టి ట్రాప్‌లో పడేయాలని చూస్తోందని, అలాంటి ట్రాప్‌లో పడకుండా ఆయన హుందాగా వ్యవహరించాలని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్



వివరాలు 2లో..





8లో..

## ఆన్ లైన్‌లోనే అమ్మల మొక్కులు..


నిలువెత్తు బంగారం సమర్పించేలా యాప్

ప్రారంభించిన మంత్రి సురేఖ

## మేడారంలో జనజాతర

కన్నెపల్లిలో గుడిమెలిగే పండగ ప్రారంభం

గిరి జాతరకు భారీగా తరలివస్తున్న భక్తజనం





8 లో..

## అగ్రం పహాడ్ జాతరకు హాజరుకండి

సీపీని ఆహ్వానించిన పూజారులు

# వేడెక్కుతున్న రాజకీయం



- వాడివేడిగా సాగనున్న బడ్జెట్ సమావేశాలు
- అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్న విపక్షాలు
- కాంగ్రెస్ పై ముప్పేట దాడి చేసేందుకు పక్కా ప్లాన్
- రేవంత్‌ను రెచ్చగొట్టి ట్రాప్‌లో పడేసేలా స్కెచ్
- పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా విమర్శనాస్త్రాలు
- రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వేసవి ప్రారంభానికి సూచికగా శివరాత్రికి ముందే సూరీడు మెల్లగా వేడెక్కుతున్నాడు. బాబోయ్ ఎండలు అనేలా సూర్యగమనం మొదలైంది. ఇక ఈయేడు కూడా ఎండలు మండిపోనున్నాయి. ఇదే క్రమంలో ఎన్నికల వేడి కూడా అంటుకుంటోంది. ఏప్రిల్‌లో ఎండలు సుర్రుమనే నాటికి ఎన్నికల వేడి కూడా తారా స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తెలంగాణలో ఈ వేడి మరింత రాజుకునే అవకాశం ఉంది. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా విమర్శనాస్త్రాలు గుప్పించనున్నారు. శ్వేతపత్రాలతో కేసీఆర్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ఎండగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోమారు కాళేశ్వరం సహా అనేక ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై నిలదీసేందుకు సిద్ధపడుతున్నారు. అదే విధంగా ధరణి సమస్యలను ప్రస్తావించడం ద్వారా బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టాలని వారు భావిస్తున్నారు. అయితే అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డిపై ముప్పేట దాడి చేసేందుకు బీఆర్ ఎస్ నాయకులు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. కేసీఆర్ అధికారంలో ఉండగా ప్రతిపక్షాలకు అసెంబ్లీలో మాట్లాడనిచ్చే అవకాశం ఇవ్వలేదు. కనీసం మైక్ కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత స్వేచ్ఛనిచ్చారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాన్స్ వస్తే వదులుకోకుండా కాంగ్రెస్ పై దాడి చేసేలా పక్కా ప్లాన్ వేసుకున్నారు.

## కట్టు తప్పుతున్న రేవంత్..

కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వార రెండు నెలల పాటు సంయమనంగా ఉండగలిగారు. కానీ ఇప్పుడు ఆయన మాటలతో కట్టు తప్పుతున్నారు. దారుణమైన భాషతో కేసీఆర్ పై, బీఆర్ఎస్ పై విరుచుకపడుతున్నారు. రాజకీయాల్లో హుందాగా ఉండాల్సిన రేవంత్ ఆ భాష గతంలో కేసీఆర్ వాడిందేనంటూ సమర్థించుకుంటున్నారు. అయితే ప్రతిపక్షాల ట్రాప్ లో పడేలా రెచ్చగొట్టి రెచ్చిపోయేలా చేస్తారని గుర్తించాలి. అయితే ఎన్నికల సమయంలో ఎలాంటి భాష వాడినా, ఎలాంటి విమర్శలు చేసినా చెల్లుతుంది. అధికారంలోకి వచ్చినందున సీఎం రేవంత్ రెడ్డి భాష విషయంలో సంయమనం పాటించాల్సిందేనంటూ రాజకీవ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. హుందాగా ఉండాల్సిందేనంటున్నారు. మాటలను పరుషంగా వాడినప్పటికీ అందులో అసభ్యత లేకుండా చూసుకోవాలంటున్నారు.

## తప్పులను ప్రజల ముందుంచాలి..

గత అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ ఎస్ చేసిన అవినీతి అక్రమాలను ప్రజల ముందుంచడంలో కాంగ్రెస్ పార్టీ నేతలు కృతక్రుత్యులయ్యారు. అదే విధంగా గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను ప్రజల ముందుంచాలి. దీంతో తప్పు ఎవరిది.. ఒప్పు ఎవరిది అనేది ప్రజలే అర్థం చేసుకుంటారు. అందుకు అసెంబ్లీని వేదికగా చేసుకోవాలి. అన్ని విషయాలను ప్రజలకు అర్థం అయ్యేలా చెప్పాలి. ఇక్కడే తొందరపాటు పనికిరాదు. ఈ క్రమంలో అసెంబ్లీలో గత ప్రభుత్వ తప్పిదాలను కూడా ఎండగట్టాల్సిందే. అప్పుల పైనా నిలదీయాల్సిందే. అందుకు తగు విధంగా సన్నద్ధం కావాలి. విపక్షాన్ని దోషిగా నిలబెట్టాల్సిందే. తెలంగాణను అభివృద్ధి చేశామన్న ముసుగులో అప్పులు చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలముందు దోషిగా నిలబెట్టే క్రమంలో కాంగ్రెస్ ముఖ్యనేతలు సమష్టిగా పోరాడాలి.

## ట్రాప్‌లో పడొద్దు..

ఇంద్రవెల్లిలో నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ సభలోనూ రేవంత్ రెడ్డి మాటల తూటాలు పేల్చారు. ప్రభుత్వాన్ని పడగొడతామని మాట్లాడున్నారని వారిని పండబెట్టి తొక్కుతామని, కట్టేసి కొడతామని హెచ్చరికలు జారీ చేశారు. అయితే రెచ్చగొట్టేందుకు బీఆర్ఎస్ సిద్దంగా ఉంది. వారి ట్రాప్‌లో పడి రెచ్చిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత సీఎంగా రేంవత్ రెడ్డిపై ఉంది. తన ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన పని సీఎం విరీదనే ఉంటుంది. కానీ మాటలు జారడం వల్ల ప్రతిపక్షానికి దొరికిపోతారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అనేది ఎప్పుడూ ప్రభుత్వాలను ఇరుకున పెట్టడానికే ప్రయత్నిస్తుంది. ముఖ్యమంత్రి స్థానానికి ఓ గౌరవం ఉంటుంది. దాన్ని కాపాడాల్సిన బాధ్యత.. ఆ సీటులో కూర్చున్న వారికే ఉంటుంది. నాడు కేసీఆర్ అలా చేశారని ఈ రోజు రేవంత్ రెడ్డి అంతకు మించి చేస్తే..రేపు వచ్చే వాళ్లు మరింత దిగజారుస్తారు. అప్పుడు పోయేది ఆయా వ్యక్తుల పరువు కాదు.. సీఎం హోదా పరువని గుర్తించుకోవాలి.

## కక్ష సాధింపులుండవ్..

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే కక్ష సాధింపులకు పాల్పడతారని అందరూ అనుకున్నారు. కానీ ఆయన అలాంటి కక్ష సాధింపులకు ఇంకా పాల్పడలేదు. అలాంటివేవిరీ ఉండవని ఆయనే స్వయంగా చెప్పారు. రెండు నెలలపాటు అలాగే పరిపాలన చేశారు. ఎందుకంటే కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు ఎక్కువ. తెలంగాణలో కూడా అదే పరిస్థితి. కానీ రేవంత్ చాలా సున్నితంగా వ్యవహారాలను చక్కదిద్దుకుంటూ వెళ్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్, దిగువ స్థాయి పోలీసు అధికారుల పోస్టింగ్‌లు, పదోన్నతులు, భూముల వివాదాలు వంటి విషయంలో ఎక్కడా పార్టీ నేతల్ని నొప్పించకుండా.. అలాగని పైరవీలకు తలొగ్గకుండా పని చేసుకుంటూ పోతున్నారు. విధాన పరమైన నిర్ణయాల విషయాల్లో కూడా ఆయన తొందరపాటు ప్రదర్శించడం లేదు. పరిస్థితుతలను అదుపులోకి తెచ్చేందుకు మాత్రం ప్రయత్నిస్తున్నారు. అందుబాటును బట్టి రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. నామినేటెడ్ పదవుల విషయంలోనూ లౌక్యంగా వ్యవహరిస్తున్నారు.

## గవర్నర్‌తోనూ సయోధ్య..

ప్రభుత్వ నిర్ణయాలను గవర్నర్ తమిళిసై అంగీకరించేలా చేయడంలో ఆయన అంతులేని లౌక్యాన్ని ప్రదర్శించారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. గతంలో తమిళిసై ప్రభుత్వ ప్రతిపాదనలు అనేకం పెండింగ్‌లో పెట్టారు. ఎంఎల్‌సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అవిరీర్ అలీఖాన్ ఎంపిక సులభమయ్యేలా సఫలీకృతమయ్యారు. తర్వాత కోర్టు స్టేటస్ కో విధించింది. అది వేరే విషయం. కేంద్రంతో కూడా ఘర్షణ పూరిత వైఖరి కాకుండా సయోధ్యతో వ్యవహరిస్తూ మెహదీపట్నంలో ప్రధాన సమస్యగా ఉన్న స్కైవాక్ నిర్మాణానికి ప్రధాన ఆటంకంగా ఉన్న రక్షణ శాఖ భూములను అప్పగించేలా చేయడంలో విజయ వంతమయ్యారు. మెట్రో రెండో దశ విస్తరణలోనూ ఆయన రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు పెద్దపీట వేయలేదు. లోక్‌సభ ఎన్నికలు జరిగే ఏప్రిల్‌లోపు, ఎన్నికల కోడ్ వచ్చేలోపు మరికొన్ని హామీలు అమలు చేయడం ద్వారా ప్రజల విశ్వాసం పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.





# మ్యాట్ లాబ్ సిములింక్‌పై వర్క్ షాప్

## వాగ్దేవిలో ప్రారంభించిన ప్రొఫెసర్ ఏఆర్ సీ రెడ్డి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని వాగ్దేవీ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 7నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న మ్యాట్ లాబ్ సిములింక్ పై ఏర్పాటు చేసిన వర్క్ షాప్ ను ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఐఈఐ) వరంగల్ లోకల్ సెంటర్ చైర్మన్ ప్రొఫెసర్ ఏఆర్ సీ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వాగ్దేవిలోని ల్యాబులను పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.తిరుపతి రావు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యవక్త డాక్టర్ వి.వెంకటరమణ కంప్యూటర్ ల్యాబ్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వరా మ్యాట్ లాబ్ సాఫ్ట్ వేర్ ను ఉపయోగించి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అప్లికేషన్స్ పై ఎలక్ట్రికల్ ప్రాజెక్టు వర్క్ చేయుటకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులు యూజీసీ, ఎన్ ఈపీ పాలసీ మేరకు పరిశోధనలతో కూడిన ఇంటర్న్ షిప్స్, ప్రాజెక్టు వర్కులు చేయిస్తున్నామన్నారు. ఇందుకుగాను విద్యార్థులు ప్రోగ్రామింగ్, కోడింగ్, సిములేషన్ వంటి సాంకేతికతను పెంచుకుని పవర్ సిస్టమ్స్ డీరెగ్యులేషన్, ఆప్టిమైజేషన్, ఆర్టిఫిజియల్ ఇంటలిజెన్స్ మెలకువలను నేర్చుకుని ఎలక్ట్రికల్ వెహికిల్స్, బ్యాటరీ మేనేజ్ మెంట్, స్మార్ట్ గ్రిడ్ వంటు అధునాతన అంశాలపై ప్రాజెక్టు వర్క్ చేయాలని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఐ సెక్రటరీ డాక్టర్ ఏవీ గిరిధర్, ఈఈఈ విభాగాధిపతి పి.పూర్ణచందర్ రావు, కార్యక్రమ కో-ఆర్డినేటర్లు డాక్టర్ సీహెచ్.రాజు, టి.రాజేష్ తోపాటు 200మంది ఎంపిక చేసిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురిని ఘనంగా సన్మానించారు.





## రామాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నల్లబెల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో మాతా రామాబాయి అంబేద్కర్ 126వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ హాజరై రామా బాయ్ చిత్రపటానికి పూల మాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత జాతిలో వెలుగులు నింపడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన కృషికి వెన్నుదన్నుగా నిలిచి దళిత జాతి ఔన్నత్యం కోసం పాటుపడిన మహిళగా మాత రామాబాయి సేవలు మరువలేనివని అన్నారు. ప్రతి ఒక్కరూ మాత రామాబాయిని ఆదర్శంగా తీసుకొని భారత జాతి అభ్యున్నతికి కృషి చేయాలని ఈ సందర్భంగా మహిళా జాతికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బన్నా ప్రభాకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాకం హరిశంకర్, బీజేపీ నాయకులు గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లిగంటి నర్సింగ్గం, జిల్లా ఉపాధ్యక్షులు దండు చక్రపాణి, ఇల్లందుల కిషన్, మోకిడే ప్రభాకర్, వల్లే రమేష్, ఎండీ రఫీ, శ్రీకాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 3న పల్స్ పోలియో



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వచ్చే నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంపై ఐఎంఏ హాల్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు, హెల్త్ సూపర్ వైజర్లకు పల్స్ పోలియో కార్యక్రమం డిస్టిక్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ అంబరీష్ పాల్గొని మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వచ్చే నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులను, సూపర్ వైజర్, సిబ్బందిని కోరారు. డిస్ట్రిక్ట్ ఇమ్యూనిజషన్ ఆఫీసర్ డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డేబోయిన శ్రీనివాస్, కేవీ రాజు హెల్త్ ఎడ్యుకేటర్, రామకృష్ణ హెచ్ ఈ ఓ, అరుణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, డీవీఎల్ఎం ఉమాకర్, వైద్యాధికారులు, సూపర్ వైజర్ సిబ్బంది పాల్గొన్నారు.

## 10 నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 9వ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 10, 11న నిర్వహించనున్నారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రంలోని 20జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని క్రీడల కన్వీనర్ ఆరూరి సుమలత తెలిపారు. ఈ క్రీడల నిర్వహణకు సంబంధించిన గోడపత్రికను బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మ ప్రకాష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణలత, పద్మజ, కిరణ్మయి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్ష



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో ఆర్ డీఓ రామ్మూర్తి అధ్యక్షతన మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంచాయతీరాజ్, గ్రామ పంచాయతీ స్పెషల్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ అధికారులు, వివిధ శాఖల అధికారులు ఒకరికోకరు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఘనపూర్ మండల కేంద్రంలో సైడు కాల్వలు ఆపరిశుభ్రంగా ఉన్నాయని, ఫ్లై ఓవర్ బ్రిడ్జి క్రింద చట్ట విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఆపివేయాలని, నాణ్యత గల డివైడర్లను, సెంటర్ లైటింగ్ లను ఏర్పాటు చేయాలన్నారు. వాటి ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి శివునిపల్లికి వెళ్లే దారి పూర్తిగా దెబ్బతిన్నది, దానిని మరమ్మత్తు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. అలాగే



అండర్ రైల్వే బ్రిడ్జి క్రింద సీసీ రోడ్డు మరమ్మతులు కూడా చేయాలన్నారు. శివునిపల్లి, ఘనపూర్ మార్కెట్లను ఫ్లైఓవర్ బ్రిడ్జి క్రింద ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. సర్వీస్ రోడ్ల పైన మెట్లు, ర్యాంపులు కడుతున్నారని, దానివల్ల వాహనదారులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. సర్వీస్ రోడ్డు మీద ఉన్న ట్రాన్స్ ఫార్మర్, ఇతరత్ర వాటిని మరొక ప్రదేశానికి షిఫ్టింగ్ చేయాలన్నారు. అలాగే బస్టాండ్ ప్రాంతం లో ఖాళీగా ఉన్న 2ఎకరాల ఆర్టీసీ స్థలాన్ని ఆర్టీసీ అధికారులతో చర్చించి స్టేషన్ ఘనపూర్ కు మంజూరు అయిన 100పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే బస్టాండ్ ఆవరణలో, శివునిపల్లి ట్రాక్ క్రింద కమ్యూనిటీ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, మండల స్థాయి అధికారులంతా క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్తాయి సమాచారంతో ఉండాలన్నారు. నిబద్ధతతో పని చేసే ప్రతి అధికారికి నా ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ బట్టల వర్తక సంఘం అధ్యక్షుడు గుండా నమశ్శివాయకు బట్టల గుమాస్తాల సంఘం ఆధ్వర్యంలో 2024 ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వివిధ బట్టల షాపులలో పనిచేస్తున్న గుమాస్తా కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు, పని భద్రత లేక అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న పరిస్థితి ఉందన్నారు. మహిళా గుమస్తా కార్మికులకు సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తక్కువ జీతాలతోని యజమాన్యం పనిచేయుచుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎంతో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ యజమానులకు పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను చేస్తుందని దుయ్యబట్టారు.మోడీ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న కార్మిక సమ్మె గ్రామీణ బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ షాపులలో పనిచేస్తున్న గుమాస్తా సోదరులందరూ మన హక్కుల సాధన కోసం కనీస వేతనాలు, ఎనిమిది గంటల పని దినాలు అమలు కావాలన్నా సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బట్టల షాపు గుమాస్తాల సంఘం నాయకులు పెండెం కుమారస్వామి, రాజు, రాధిక, రాజేందర్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతల దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజా పాలనలో ముందున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దుర్భాషలాడిన బాల్క సుమన్, గురువులు కేసీఆర్, కేటీఆర్ ల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు ఊరేగించి దహనం చేశారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు గౌడు నాగరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు అధికారం పోయి ఆగం ఆగం అవుతున్నారని విమర్శించారు. నోటికి ఎంత వస్తే అంతా.. ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాలేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతిని తప్పుదోవ పట్టించేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వారు అధికారంలో ఉన్నప్పుడు వారు చేసే అక్రమాలు ఇంత అంత కావని తెలిపారు. నోరు దగ్గర పెట్టుకోవాలని, బీఆర్ఎస్ నాయకులు పది సంవత్సరాల్లో చేసిన అక్రమాలపై విచారణ చేపట్టి వారిపై కేసులు బుక్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉట్ల ప్రవీణ్, పోలేపాక విశాల్ బాబు, ఎస్కె టైమర్, కట్కూరి అన్వేష్, సర్దార్ జస్వీర్ సింగ్, గూడ నవీన్, దౌడు నాగరాజ్, రామగిరి శ్రీవిద్య, పొడిశెట్టి సరళాదేవి, దామెర కొండ విజయలక్ష్మి, కొండపర్తి శ్రీలత, తెలుగు శ్యామల, రబ్బాని, దుర్గ, పద్మ, చింత కుమార్, వెలగొండ శ్రీనివాస్, మంద ఇమాన్యుల్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఎంపీ అభ్యర్థి టికెట్‌ను మాలలకే కేటాయించాలి

### మాల మహానాడు నేత బొల్లం రామ్ కుమార్



వరంగల్ వాయిస్, వరంగల్ : స్థానిక రత్న హోటల్‌లో మాల మహానాడు జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షుడు బొల్లం రామ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అనంతరం ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో మాలమహానాడు వరంగల్ జిల్లా కమిటి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాంకుమార్ మాట్లాడుతూ వరంగల్ ఎంపీ టికెట్ ను మాలలకు కేటాయించాలని కోరారు. పార్లమెంట్ కు జరగబోయే ఎలక్షన్లలో వరంగల్ పార్లమెంట్ ఎంపీ స్థానానికి మాల కులానికి చెందిన అభ్యర్థిని మాత్రమే నిలబెట్టాలని కేంద్ర, రాష్ట్ర పార్టీల అధ్యక్షులను డిమాండ్ చేశారు. రాబోయే ఎలక్షన్ లో తెలంగాణ రాష్ట్రంలో 17పార్లమెంట్ నియోజకవర్గాలలో ఎలక్షన్ జరగుతున్నందున అందులో ఎస్సీలకు కేటాయించిన మూడు స్థానాలలో కనీసం రెండు స్థానాలను అందులో వరంగల్ పార్లమెంట్ స్థానానికి మాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు మాత్రమే ఎంపీ టికెట్ ను కేటాయించాలని కోరారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం డిలిమిటేషన్ జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు మాలలకు ఎంపీ స్థానంలో ఏపార్టీ ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికలలో ప్రధాన పార్టీలు మాలలకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఒకవేల మాలలకు కాకుండా వేరే సామాజిక వర్గానికి ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇస్తే వారి పార్టీకి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా తమ మాల మహానాడు పని చేస్తుందని బొల్లం రామ్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా మాల మహానాడు మహిళా కమిటీ అధ్యక్షురాలు కునమల్ల అనిత, సంపత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

బుధవారం 07, ఫిబ్రవరి 2024
www.warangalvoice.net

# కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

## ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రేపు ఆల్ ట్రేడ్ యూనియన్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో డీసెంట్ ఫంక్షన్ హాల్ లో జరుగుతున్నటువంటి సదస్సును, ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఉద్యోగులైన, శానిటేషన్, పేషెంట్కేర్, సెక్యూరిటీ సిబ్బంది కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంజీఎం ఆసుపత్రిలో సమ్మె వాల్ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా రెక్కాడితే గాని డొక్క నిండని పరిస్థితులు ఉంటాయని, చాలీచాలని వేతనాల తీసుకుంటూ పేద, బడుగు బలహీన వర్గాలకు సేవ చేస్తున్నారన్నారు. కానీ వీరికి శ్రమదోపిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ చట్ట ప్రకారం ఇవ్వాల్సిన పండుగ, జాతీయ, ఆర్జిత సెలువుల అమలు చేయాలని, అలాగే ఈనెల 16న జరిగే దేశవ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. ఈనెల 8న హాల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో డీసెంట్ ఫంక్షన్ హాల్ లో జరుగు సదస్సును విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులందరికి పర్మినెంట్ చేయాలన్నారు. 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని, కార్మిక వ్యతిరేకైనా నాలుగు లేబర్ కొడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్లకు మేలు చేస్తుందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని మండిపడ్డారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మెడికల్ అండ్ హెల్త్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సాంబరాజు, శివానందం, తెలంగాణ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద సంజీవ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకూబ్, ఎంజీఎం హాస్పిటల్ పేషెంట్ కేర్ అధ్యక్షుడు వీరగాని రంజిత్, సెక్యూరిటీ గార్డ్ అధ్యక్ష, కార్యదర్శులు నెల్లూరు రాజు వీర్, దువ్వ యోగేందర్, వి శ్రీనివాస్, బి జయ ప్రకాష్, డి శివ, జై మల్లేష్, రమేష్, స్రవంతి, సీహెచ్ కార్తీక్, జి శ్రీనివాస్, వి రమేష్, జె రమేష్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఈవీఎంల ఎఫ్ఎల్సీ

## జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య



**వరంగల్ వాయిస్, జనగామ :** కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ గోడౌన్ లో కొనసాగుతోన్న ఈవీఎం యంత్రాల మొదటి దశ తనిఖీ (ఎఫ్ఎల్ సీ) ప్రక్రియను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇంజినీర్ల ఆధ్వర్యంలో జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎఫ్ఎల్ సీ నిర్వహిస్తున్న ఇంజినీర్లు, అధికారులు, సాంకేతిక నిపుణులతో ఇప్పటివరకు చేపట్టిన ప్రక్రియను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియలో (874) బ్యాలెట్ యూనిట్లు, (584) కంట్రోల్ యూనిట్లు, (861) వీవీ ప్యాట్లను అధికారులు, సాంకేతిక నిపుణులు తనిఖీ చేస్తున్నారు. ఈ మొదటి దశ తనిఖీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పి.రవీందర్, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన అవసరం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సైబర్ జాగరూకత దివాస్ సందర్భంగా బుధవారం వరంగల్ లాల్‌బహదూర్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సైబర్ క్రైమ్ డీఎస్పీ సైబర్ నేరాల ఎంఓలు, 1930హెల్ప్ లైన్, సైబర్ క్రైమ్ పోర్టల్ ప్రాముఖ్యతను వివరించారు.

# ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. యువజన సంఘం అధ్యక్షుడు కొంగర విజయ్ ప్రకాష్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ ఒక జాతి అభివృద్ధి కోసం తన పిల్లలను త్యాగం చేసిన మహా త్యాగశీలి రమాబాయి అన్నారు. అంబేద్కర్ ఉన్నత చదువుల కోసం విదేశాల్లో ఉన్నప్పుడు కుటుంబాన్ని తన భుజ స్కందాలపైన వేసుకుని నడిపించిన ధైర్యశాలి రమాబాయి అని కొనియాడారు. ఆర్థికంగా వెనుకబడిన అంబేద్కర్ ఉన్నత చదువుల కోసం ప్రతి నెల డబ్బులు పంపించి అంబేద్కర్ ను జ్ఞాన సూర్యున్ని చేయడంలో రమాబాయి కృషి వర్ణించలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్ కళ్యాణ్, జిల్లా కార్యదర్శి నాలిక ప్రతాప్, బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్, సంఘం కార్యదర్శి నాలిక శ్రీకాంత్, మొగ్గం నరేష్, కునమల్ల సాయి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# గృహ జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ నిలబెట్టుకునేందుకు ఆ పథకానికి సంబంధించిన, విధి విధానాలను రూపొందించడం జరిగింది. అందులో భాగంగా ప్రతి గ్రామంలో అర్హత గల విద్యుత్ వినియోగదారుడు మీ ఇంటి వద్దకు ప్రతి నెల మీటర్ రీడింగ్ నమోదు చేసే విద్యుత్ అధికారికి ఈ నెల మీటర్ రీడింగ్ సమయంలో మీ రేషన్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ కు సంబంధించిన వివరాలను అందించాలని విద్యుత్ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు తెలియజేశారు.

# ఆర్‌బీఎస్‌కే ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కుమార్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన సముదాయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆర్ బీఎస్ కే ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ ఆర్ బీఎస్కె ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డాక్టర్ కుమార్ ను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంహెచ్ఓ డాక్టర్ అంబరీష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ మురళీధర్, ఆర్బీఎస్ కే జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వడ్డెరపోయిన శ్రీనివాస్, ఆర్ బీఎస్ కే జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ డి.కుమార్ లు పాల్గొని జిల్లా ఆర్ బీఎస్ కే అధ్యక్షులు, కార్యవర్గ, ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కుమార్ మాట్లాడుతూ తనపై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వస్తామని తెలిపారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సంజీవ్ నాయక్, అక్షిత, జనరల్ సెక్రెటరీ డాక్టర్ శివరామ్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ సౌజన్య, శ్రీజ, లావణ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ అశోక్, రఘునాథ్, సుమలత, ట్రెజరీ డాక్టర్ సాయి లక్ష్మి, సౌమ్యకుమారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ డాక్టర్ రేణుక శ్రీలక్ష్మి భవాని సుందర్ లాల్, డాక్టర్స్, మెడికల్ రిప్రజెంట్లు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఎంపీపీ ఎస్ కంఠాయపాలెంలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠాలు చెప్పడం ఎంతో ఇబ్బందని, పిల్లలు సరిగా వినడం లేదని వారి అనుభవాలను పంచుకున్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలిగా ప్రవళిక, ఉపాధ్యాయులుగా రుచిక, అవంతిక, అక్షర, భవ్య, వైష్ణవి, అంకిత, కలాం, సాయి సింహాద్రి, అక్షయ్, సురేష్, భరత్, యశ్వంత్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జినుగా జయప్రద, ఉపాధ్యాయ బృందం తిరుమలేష్, నాగరాజు, శ్రీనివాస్, పవన్ కుమార్ , శార్వరిదేవి తదితరులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# విద్యార్థుల క్షేత్ర పర్యటన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** క్షేత్ర పర్యటనల ద్వారా విద్యార్థులు తరగతి గది పాఠ్యాంశాలలోని అంశాలను సహజ స్థితిలో అర్థవంతంగా నేర్చుకుంటారని ఆరేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలమల్ల నాగేశ్వరరావు అన్నారు. ఒకరోజు క్షేత్ర పర్యటనలో భాగంగా విద్యార్థులు వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. దీనిలో విద్యార్థులకు ఒక రోజు కురిసే వర్షపాతాన్ని ఏ విధంగా లెక్కిస్తారో, అదే విధంగా గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలను ఏ విధంగా నమోదు చేస్తారో వ్యవసాయ పరిశోధన కేంద్రం సైంటిస్ట్ ఎల్.శకుంతల వివరించారు. గాలి వ్యాపించే దిశా, గాలి వేగం, గాలిలో తేమశాతం ఏ విధంగా కనుక్కుంటారో పిల్లలకు అవగాహన కల్పించారు. ఐదో తరగతి పాఠ్యాంశంలోని వర్మీ కంపోస్ట్ ఫిట్ నిర్మాణం, తయారీ విధానం, వర్మీ కంపోస్ట్ (సేంద్రియ ఎరువు) రైతులు వాడడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని పిల్లలకు అర్థవంతంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయులు విజయ, రాజిరెడ్డి, మున్ని, తిరుమల పాల్గొన్నారు.

# పర్యావరణ అంశాలపై విద్యార్థులకు అవగాహన



**వరంగల్ వాయిస్, జనగామ :** తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, జనగామ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన జిల్లా పరిషత్(జడ్పీ) సమావేశాన్ని పాఠశాల స్థాయిలో నిర్వహించడం జరిగింది. రఘునాథపల్లి మండలంలోని 16ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన సమ్మక్క-సారక్క జాతరలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై విద్యార్థులతో జిల్లా పరిషత్ సమావేశాలు పాఠశాల స్థాయిలో నిర్వహించగా రఘునాథ పల్లి మండల నోడల్ ఆఫీసర్ రఘునందన్ రెడ్డి పాల్గొన్నారు. నిడిగొండ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన నమూనా జిల్లా పరిషత్ సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పర్యావరణ అంశంపై మాట్లాడిన విధానాన్ని గమనించి, విద్యార్థులకు పర్యావరణపై అవగాహన కలిగి ఉండటం అభినందనియమని ప్రశంసించారు. సమ్మక్క-సారక్క జాతరలో పాల్గొనే భక్తులు ప్లాస్టిక్ రహిత వస్తువులనే వాడే విధంగా చూడాలని సూచించారు. 16ఉన్నత పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉర్దూ జర్నలిస్టుల మొదటి కార్యవర్గ సమావేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జనవరి నెలలో జరిగిన ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు సాజిద్ పాష ఆధ్వర్యంలో ఎల్బీనగర్ స్వాగత్ గెస్ట్ హౌస్ లో బుధవారం టీయూడబ్ల్యూజేఎఫ్ వరంగల్ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల కమిటీ కార్యవర్గ మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ జర్నలిస్టుల సమస్యలు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ ఏకాభిప్రాయం తెలియజేసింది. ఈ కార్యవర్గ సమావేశంలో వరంగల్ జిల్లా ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు అధ్యక్షుడు మహమ్మద్ సాజిద్ పాషా, కార్యదర్శి నయీం, కోశాధికారి మహ్మద్ అమీర్, సలహాదారులు వహీద్ గుల్షాన్, ఎస్ ఏం సయీద్, ఇస్మాయిల్ జబీ, ఉపాధ్యక్షులు అలిం ధనిష్, మున్వేర్, ఉప కార్యదర్శి ఫెరోజ్ ఖాన్, మషుక్, రియాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నిజాం, కార్యవర్గ సభ్యులు శకీర్, బషీర్,బాబర్, మొమిన్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మామునూరు ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి, వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు పాఠశాల సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు. తను చదువుకున్న పాఠశాల తల్లి ఒడిలో చిన్న పిల్లవాడిగా మారిపోయి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు కూడా చక్కని సందేశం అందించారు. అంతేగాక తొలి విడతగా పాఠశాలకు ఐదు లక్షల రూపాయలను అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరొక విద్యార్థి, సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్ రావు కూడా పాల్గొనడమే గాక అతిథులకు భోజనాలు, స్నాక్స్ ను కూడా అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన స్థానిక నాయకులు జలగం రంజిత్, పోశాల స్వామి, వడ్డేపల్లి ప్రకాష్, మాచర్ల చంద్రమౌళి, నాగరాజు తో చదివిన పూర్త విద్యార్థులు, ఏసీపీ సతీష్ బాబు, వరంగల్ జిల్లా డీఈవో డి.వాసంతి పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తను కూడా పూర్వ విద్యార్థినే కనుక తనను కూడా గ్రూపులో చేర్చమని చెప్పారు. ఆయన స్పీచ్ అసాంతం మధురస్మృతుల కలబోతగా సాగింది.

# చదువుతో సామాన్యుడు శక్తివంతంగా మారవచ్చు

## సైకాలజిస్ట్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరికిపండ్ల అశోక్




**వరంగల్ వాయిస్, జనగామ :** ఒక మనిషి శక్తివంతమైన ఆలోచనలు, నమ్మకాలు, అలవాట్లు ప్రవర్తనలతో ఉన్న సామాన్యుడు కూడా శక్తివంతంగా మారవచ్చునని సైకాలజిస్ట్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం-ముందడుగు సాధ్యమని, శాస్త్రీయ ప్రణాళిక -పునస్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చునని, విద్యార్థులు చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చునని, విద్యార్థులు ఇటువంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగపరుచుకోవాలని డాక్టర్ అశోక్ పరికిపండ్ల కోరారు. బుధ వారం జనగాం జిల్లా ఖిలాశాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆడెపు శ్రీనివాసులు అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే రాష్ట్రవ్యాప్త ప్రేరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గౌరవ అతిథి ఖిలా షాపూర్ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రేరణ సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల పరీక్షా ఫలితాలను పెంపొందించుటకు, పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు సైకాలజిస్ట్ ల సంఘం సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సద్వినియోగపరచుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9989310141 లలో సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలు ఏర్పాటు, చదువుకునే పద్ధతులు, జ్ఞాపకశక్తి మెలకువలు, టెన్షన్ అధిగమించే మార్గాలను సోదాహరణంగా విద్యార్థులకు వివరించారు . తాత్కాలికమైన సమస్యల వల్ల శాశ్వతమైన జీవితానికి చరమాంకం పాడొద్దని, ఆత్మహత్యలకు చేరువ కావద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భగవాన్ రెడ్డి, లింగమూర్తి, రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, మాధవి లత, అలకానంద, ప్రసన్న, సరలి, సుజాత, పాండ్య పాల్గొన్నారు.

# వరంగల్ ఎంపీ సీటు కేటాయించాలి

## ఏఐసీసీ ఇంచార్జి దీపాదాస్ మున్షికి పెరుమాండ్ల రామకృష్ణ వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హైదరాబాద్ లో ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి దీపాదాస్ మున్షి మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ శర్మ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వరంగల్ ఎంపీ సీటు కేటాయించాలని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కోరారు. వారంతా సానుకూలంగా స్పందించగా అందరికి పెరుమాండ్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో భాగంగా డాక్టర్ రామకృష్ణ వరంగల్ ఎంపీ ఎన్నికలలో తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ తన బయోడేటాను అందజేశారు. డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి మీద పూర్తి నమ్మకం ఉందన్నారు. విద్యార్థి దశ నుంచి పార్టీ కోసం కష్టపడుతూ వచ్చానని, పార్టీ కోసం కష్టపడ్డ వాళ్లను అధిష్ఠానం గుర్తించాలని, పేద బడుగు బలహీన ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా రామకృష్ణ కోరారు.

# కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలి



## స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం

**వరంగల్ వాయిస్, జనగామ :** స్థానిక శ్రీ ఉషోదయ ఫంక్షన్ హాల్ లో బుధవారం జనగామ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకపోయినా కృంగి పోవాల్సిన అవసరం లేదని, గెలుపోటములు సహజమన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన పనులు కళ్లముందే కనపడుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ పెట్టిన హామీలు 420 పథకాలు ఆరు గ్యారెంటీ పథకాలని దుయ్యబట్టారు. రేవంత్ మాట మీద నిలబడేవాడైతే 100రోజుల్లో పెట్టిన హామీలు అమలు చేసి ఓటు అడగాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి అయ్యాక తొలి సంతకం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రైతుభరోసా కింద రూ.15000 రైతు బంధు ఇస్తామన్న హామీ ఇంకా అమలు కాలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఆలోచన లేక, అర్థం కాక ఆగమాగమై మాట్లాడుతున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 50రోజుల్లో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ రోజు రోజుకు పడిపోతుందన్నారు. వచ్చే ఎలక్షన్ లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎలా మాట్లాడుతున్నారో ఇప్పుడూ అలాగే మాట్లాడుతున్నారని అన్నారు. ఢిల్లీలో తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడాలంటే ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం పోరాడేది ఒక్క బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని, ఎంపీ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటాలని, కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బోడకుంట్ల వెంకటేశ్వర్లు,ప్రజాప్రతినిధులు, సుమారు 2000మంది బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలను మహిళలు ఉపయోగించుకోవాలి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండల కేంద్ర పరిధిలో గల ధర్మపురంలో స్టూడెంట్స్ తో సఖి వన్ స్టాప్ కేంద్రం హనుమకొండ ఆధ్వర్యంలో సఖి అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో సఖి వన్ స్టాఫ్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి మాట్లాడుతూ చిన్నపిల్లలు లైంగిక వేధింపులకు గురి కావడం జరుగుతుందని, వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ యాక్ట్ తీసుకురావడం జరిగిందని వివరించారు. అలాగే మహిళల కోసం తీసుకొచ్చిన గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వహించబడుతున్నదని తెలిపారు.

విడిపోయే భార్యాభర్తలను కౌన్సిలింగ్ ద్వారా ఒకటిగా కలపడం, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఆడపిల్ల వద్దని అకారణంగా గర్భవిచ్చితి చేయించుకోవాలని వేధింపులకు గురి చేయడం, ఇతర వేధింపులపై మానసికంగా కృంగి పోయే మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించడం కోసం సఖి వన్ స్టాఫ్ కేంద్రం కృషి చేస్తుందని పేర్కొన్నారు. సమస్యలపై సహాయం కోసం సఖి కేంద్రంకు వచ్చిన మహిళలకు ఉచితంగా కౌన్సిలింగ్ సహాయం, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సహయం, తాత్కాలిక వసతి వంటివి అందించబడుతున్నదని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సమస్యలు గల మహిళలు, బాలికలు ఉపయోగించు కోవాలని, అందుకోసం ఫోన్ నెంబర్స్ 0870-2452112, టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయగలరని మహిళలను, పాఠశాల బాలికలను కోరారు. ఈ సమావేశంలో లీగల్ కంట్రోలర్ శ్రీదేవి, క్రాస్ క్యాష్ వర్కర్ వి వెన్నెల, రుద్ర, ఏడబ్ల్యూటీ సుశీల, శోభ, ఆశ వర్కర్లు సుభాషిణి, అరుణోదయ, సీఏ వీవోడబ్ల్యూ ధర్మపురం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# టెక్స్‌టైల్ పార్క్‌లో స్థానికులకు ఉద్యోగాల కల్పనకు చర్యలు

## జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు తీసుకొవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి కలెక్టర్ కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో సంబంధిత కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పనలో స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలలో ప్రాధాన్యత కల్పించేలా వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నరసింహమూర్తి, పరిశ్రమల మౌలిక సదుపాయాల జోనల్ మేనేజర్ సంతోష్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి మాధవి, జిల్లా కార్మిక సంక్షేమ అధికారి రమేష్ బాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సుభాష్, గణేష్ ఈకోటెక్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గిరివికాసం పథకం అమలుకు చర్యలు చేపట్టాలి..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో గిరివికాసం పథకం అమలుకు ప్రత్యేకచర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరి వికాసం పథకం అమలుపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో గిరి వికాసం పథకం అమలులో భాగంగా గిరిజన రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సాగు నీటివసతి లేని ఐదు ఎకరాలు కలిగిన గిరిజన రైతులకు ప్రభుత్వం బోరుబావులు, విద్యుత్ మోటార్లను మంజూరు చేస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో ఈ పథకం ద్వారా 85మంది రైతులకు బోరుబావులు, విద్యుత్ మోటార్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల రైతులకు అవగాహన కల్పించి ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. రూ.కోటి 88లక్షల నిధులు మంజూరు కాగా మొత్తం 534ఎకరాల్లో గిరి వికాస పథకం అమలుకు శ్రీకారం చుట్టామని, 216లబ్ధిదారులకు రూ. కోటి 32 లక్షలు ఖర్చుచేసి రైతుల పోలాలకు బోర్లు వేయించడం, బార్లు తవ్వించడం చేశామని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న రూ.30లక్షల నిధులతో బోర్లు ఉన్న రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ గిరిజన రైతులకు ప్రయోజనం చేకూర్చడం జరుగుతున్నదని, మొక్కలు, స్టంప్‌లు, బండరాళ్లు మొదలైన వాటిని తొలగించడం ద్వారా బంజరు భూములను సాగు భూములుగా మార్చాలని అన్నారు. రైతులకు వ్యవసాయ సాగుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ అర్పణ, డీఆర్డీఓ పీడీ సంపత్ రావు, ట్రాన్స్ కో ఎస్సీ మధుసూదన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, ఎఫ్ఆర్ఓ రవి కిరణ్, గ్రౌండ్ వాటర్ హైడ్రాలజిస్ట్ రవి, డీఆర్ డీఏ టెక్నికల్ విభాగం అధికారి సురేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అభివృద్ధి పనుల్లో భాగంగా బుధవారం హనుమకొండ నయీంనగర్ నాలా, బ్రిడ్జ్ పనులను వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. నయీంనగర్ నాలాకు రూ.70.58 లక్షల నిధులు, నయీం నగర్ బ్రిడ్జ్ కి రూ.15కోట్ల నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏదయితే చెబుతుందో అది చేసి చూపిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల పార్టీ ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఏ రోజు కూడా ప్రజల కష్ట నష్టాల్లో పాలు పంచుకోలేదని, అభివృద్ధిపై దృష్టి సారించలేదని విమర్శించారు. వారికి పర్సంటేజీలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని ఎద్దేవా చేశారు. నాలాలు అక్రమణకు గురి కావడంతో వర్షా కాలంలో వరద భీభత్సంతో రెండు పర్యాయాలు హనుమకొండ నగరం మునిగిపోయిందని గుర్తు చేశారు. దీని వల్ల ప్రజలు ఆర్థికంగా దెబ్బతిని మానసికంగా క్రుంగి పోయారని అన్నారు. హనుమకొండ నగరం మునిగినా కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు అధికారంలో ఉండి కూడా నయీంనగర్ నాలాకు బ్రిడ్జ్ కి శాశ్వత పరిష్కారం చూపలేదన్నారు. ఎన్నికల హామీలో నాయిని రాజేందర్ నగర ప్రజలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి నాలా అభివృద్ధికి నయీంనగర్ బ్రిడ్జికి నిధులు తీసుకు రావడం జరిగిందని పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ నగర అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. నగర అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు, మున్సిపల్ డీఈలు, ఏఈలు, ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రి సురేఖను కలిసిన సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకులు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** భక్త మార్కండేయ స్వామి జయంతిని పురస్కరించుకొని ఈనెల 12న సిరిసిల్లలో నిర్వహించనున్న శ్రీ శివభక్త మార్కండేయ స్వామి శోభాయాత్రలో పాల్గొనాలని కోరుతూ బుధవారం సిరిసిల్ల పద్మశాలి సంఘం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను వారి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షురాలు గుజ్జె తార, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ఉపాధ్యక్షులు, పద్మశాలి మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు కాముని వనిత, తదితరులు ఈ సందర్భంగా మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## బ్రహ్మోత్సవాలకు రావాలని వినతి..

హైదరాబాద్ లోని జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ దేవాలయ ట్రస్ట్ బోర్డ్ బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సచివాలయంలోని వారి కార్యాలయంలో కలిసింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 14న నిర్వహించే శ్రీ స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానిస్తూ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ వేణుగోపాల్ యాదవ్, ఆలయ ఈవో కృష్ణమార్యులు మంత్రికి ఆహ్వాన పత్రికను అందించారు. దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



# ఓ స్టార్ ప్రొడ్యూసర్ మోసం చేశాడు

**లబోదిబోమన్న హీరోయిన్ మాల్వీ మల్హోత్రా**

సినిమా ఇండస్ట్రీలో రాణించడం అంతా సులభం కాదు.. చాలా మంది ఎన్నో కష్టాలు ఎదుర్కొని సినిమాల్లో రాణిస్తూ ఉంటారు. కొంతమంది సినిమాలోకి రావడానికి ఇబ్బంది పడితే మరికొంతమంది సినిమాల్లోకి వచ్చిన తర్వాత కొన్ని తమ చుట్టూ జరుగుతున్న సంఘటనలు ఇబ్బంది పడుతుంటారు. తాజాగా తాను కూడా.. ఓ స్టార్ ప్రొడ్యూసర్ కారణంగా ఇబ్బంది పడ్డానని.. ఇంకో మాటలో చెప్పాలంటే మోసపోయానని అంటోంది హీరోయిన్ మాల్వీ మల్హోత్రా.. మాల్వీ మల్హోత్రా! బుల్లితెర నుంచి సినిమాల్లోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ? తనకొచ్చిన సినిమాలు చేసుకుంటూ పోతోంది. యంగ్ హీరో రాజ్ తరుణ్ సరసన తిరగబడరా సామి తెలుగు మూవీలోనూ నటిస్తోంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాల్లోనే ఓ బాలీవుడ్‌లో తనకు ఎదురైన ఓ చేదు సంఘటన గురించి చెప్పి..లబోదిబో మంది.

## వీడియో అదుర్స్

హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరించేందుకు రెడీగా ఉంటాడు టాలీవుడ్ మాస్ హీరో మాస్ మాహరాజా. ఎప్పటికప్పుడు సరికొత్త కంటెంట్.. ఇక గతేడాది వరుసగా హిట్స్ అందుకున్న రవితేజా.. తాజాగా ఈగిల్ సినిమాతో మన ముందుకు వస్తున్నారు. డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈమూవీ నుంచి విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ మూవీపై మరింత హైప్ పెంచేశాయి. ఫిబ్రవరి 9న ఈ మూవీ అడియన్స్ ముందుకు రానున్న క్రమంలో.. ఈగిల్ మూవీ నుంచి మేకింగ్ వీడియో రిలీజ్ అయింది. ఆ వీడియో ఇప్పుడు అంతటా హాట్ టాపిక్ అవుతోంది. ఈగిల్ నుంచి రీసెంట్గా రిలీజ్ అయిన మేకింగ్ వీడియో.. సినిమా పై విపరీతంగా అంచనాలను పెంచేదిగా ఉంది. ఇంకా చెప్పాలంటే.. టీజర్, ట్రైలర్ ను మించిపోయి మరింత క్యూరియాసిటిని కలిగిస్తోంది. బ్యాగ్రౌండ్ మ్యూజిక్, విజువల్స్ అదిరిపోయాయి. దీంతో ఈ వీడియో ప్రస్తుతం యూట్యూబ్ లో ట్రెండ్ అవుతోంది.






## సక్సెస్ హీరోగా సుహాస్



గత వారం విడుదలైన 'అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్' సినిమా మంచి టాక్ ని సొంతం చేసుకోవడమే కాకుండా, బాక్స్ ఆఫీస్ దగ్గర కూడా వసూళ్లు బాగానే రాబట్టింది. దర్శకుడు దుష్యంత్ ఈ సినిమా కథ ఒక యదార్థ సంఘటన ఆధారంగా రాసుకున్నది. ఇందులో నటించిన శరణ్య ప్రభాకర్, సుహాస్ లకు మంచి పేరు తీసుకురావటమే కాకుండా, సుహాస్ కి కథానాయకుడిగా ఈ సినిమా వరసగా మూడో విజయాన్ని అందించింది. సుహాస్ ఇంతకు ముందు 'కలర్ ఫోటో' అనే సినిమాలో కథానాయకుడిగా నటించగా ఆ సినిమా ఓటిటి లో విడుదలైంది. అయితే ఆ సినిమా జాతీయ అవార్డు గెలుచుకుంది. ఆ తరువాత 'రైటర్ పద్మభూషణ్' లో కథానాయకుడిగా చేసిన సుహాస్ కి ఆ సినిమా అటు మంచి పేరుతో పాటు, డబ్బులు కూడా తెచ్చింది. అది రెండో విజయం. ఇప్పుడు మూడో సినిమా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' చేసాడు, ఇది ఇప్పటికే బ్రేక్ ఈవెన్ అయింది, మంచి విజయం సాధించింది.సుహాస్ కథానాయకుడిగా వైవిధ్యమైన కథలు ఎంచుకుంటున్నాడు, ఎదో పాటలు, లేదా వాణిజ్యపరమైన విలువలు ఉండాలి అన్నట్టుగా కాకుండా, సినిమాకి కథ ముఖ్యం, అందుకని తన ప్రతిభ చూపించుకోవడానికే వుండే విధంగా కథలని ఎంచుకుంటున్నాడు.  సుహాస్ చేతిలో ఇంకా అరడజను చిత్రాలు వున్నాయి, కొత్తవాళ్లు కథలు చెప్తున్నారు, వింటున్నాడు కూడా. చిన్న నిర్మాతలకి, కొత్త దర్శకులకి సుహాస్ వున్నాడు అన్న భరోసా కల్పిస్తున్నాడు.

## మరోమారు.. జేమ్స్ కామెరూన్ ప్రశంసలు



దర్శకధీరుడు ఎస్. ఎస్. రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంపై ఇంకా ప్రశంసల వర్షం కురుస్తూనే ఉంది. మరీ ముఖ్యంగా ఆస్కార్ అవార్డ్ వేదికపై పలువురు హాలీవుడ్ దిగ్గజాలు ఈ సినిమాపై ప్రశంసల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. వారిలో దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ ఆర్ఆర్ఆర్ సినిమాను చూసి ఆశ్చర్యపోయినట్లుగా చెప్పుకొచ్చారు. అంతేకాదు, రాజమౌళిని షేక్స్పియర్‌తో పోల్చారు. రాజమౌళి కూడా జేమ్స్ కామెరూన్‌ని కలవడంపై స్పందించారు. 'కలో.. నిజమో అని ఇప్పటికీ నమ్మలేక పోతున్నా.. నేను డైరెక్ట్ చేసిన సినిమాను అంతటి దిగ్గజ దర్శకుడు విశ్లేషించడాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని రాజమౌళి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇప్పుడు మరోసారి రాజమౌళిపై జేమ్స్ కామెరూన్ ప్రశంసలు కురిపించడంతో.. ఆర్ఆర్ఆర్ ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. ఆ వివరాలలోకి వెళితే.. తాజాగా 51వ వార్షిక శాటర్న్ అవార్డుల వేడుకను అమెరికాలో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ వేడుకలో జేమ్స్ కామెరూన్.. రాజమౌళి ప్రస్తావన తెచ్చారు. 'ఆర్ఆర్ఆర్'తో ఇండియన్ దర్శకుడు రాజమౌళి అద్భుతం చేశారు. ఆయనని కలవడం ఎప్పటికీ మరిచిపోలేను. ప్రపంచవేదికపై ఇండియన్ సినిమాను చూడడం హ్యాపీగా అనిపించిందని.. జేమ్స్ కామెరూన్ చెబుతున్న వీడియో ఒకటి సోషల్ మాధ్యమాలలో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన భారతీయులందరూ.. మరోసారి రాజమౌళికి థ్యాంక్స్ చెబుతున్నారు. తెలుగు సినిమా స్థాయిని ప్రపంచ పటంపై నిలపడమే కాకుండా.. హాలీవుడ్‌కు చెందిన దిగ్గజ దర్శకులను సైతం మెప్పించిన జక్కన్న అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ కామెంట్స్‌తో రాజమౌళి పేరు మరోసారి టాప్‌లో ట్రెండ్ అవుతోంది.

వరంగల్ వాయిస్ Evening Daily
బుధవారం 07, ఫిబ్రవరి 2024
www.warangalvoice.net

# ఆన్‌లైన్‌లోనే అమ్మల మొక్కులు..

## నిలువెత్తు బంగారం సమర్పించేలా యాప్
## ప్రారంభించిన మంత్రి సురేఖ



**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ సమాజం మహిమాన్విత శక్తులుగా కొలిచే శ్రీ సమ్మక్క సారక్కల జాతరకు వెళ్ళలేని భక్తులు ఇంటినుంచే తమ నిలువెత్తు బంగారాన్ని ఇంటినుంచే సమర్పించేలా ఏర్పాటు చేసిన ఆన్ లైన్ సేవలను బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి సురేఖ ప్రారంభించారు. తన మనవడు కొండా మురళీకృష్ణ పేరును మీ సేవ వెబ్సైట్ లో నమోదు చేసి, బరువు ప్రకారం డబ్బులు చెల్లించి అమ్మవారి గద్దెల వద్ద నిలువెత్తు బంగారాన్ని సమర్పించే సౌకర్యాన్ని మంత్రి సురేఖ పొందారు. వివిధ కారణాలతో సమ్మక్క సారాలమ్మలను దర్శించుకోలేని భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఐటి శాఖ సహకారంతో దేవాదాయ శాఖ అమలు చేస్తున్న ఈ సేవలు బుధవారం నుంచే ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు ప్రకటించారు. మీ సేవ (ఆన్లైన్, ఆఫ్ లైన్), టి-యాప్ ఫోలియో (ఆన్లైన్), పోస్టల్ డిపార్ట్మెంట్ల (ఆఫ్ లైన్) ద్వారా ఎవరి పేరు మీదైతే బంగారం సమర్పించాలనుకుంటున్నారో వారి బరువును అనుసరించి డబ్బులు చెల్లించేలా దేవాదాయ శాఖ వెసులుబాటు కల్పించింది. రాష్ట్రంలోని దాదాపు 5 వేల మీ సేవా సెంటర్లు, దేశంలోని దాదాపు 1.5 లక్షల పోస్టల్ కేంద్రాలు (తెలంగాణలో 6 వేల కేంద్రాలు) ఈ సేవలను అందిస్తాయన్నారు. దేవాదాయ శాఖ సంవత్సరం పొడవునా బంగారం సమర్పణ సేవలను అందిస్తుందని మంత్రి ప్రకటించారు. బంగారం సమర్పణతో పాటు, అమ్మవారి ప్రసాదం కావాలనుకునే వారు కూడా పోస్టల్ డిపార్ట్ మెంట్, టి-యాప్, మీ సేవా కేంద్రాల ద్వారా డబ్బులు చెల్లించినట్లైతే, పోస్టల్ డిపార్ట్ మెంట్ కొరియర్ ద్వారా వారికి ప్రసాదాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, పలువురు దేవాదాయ శాఖ అధికారులు, పోస్టల్ డిపార్ట్ మెంట్, మీ సేవ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హరితనిధిపై మంత్రి సురేఖ సమీక్ష



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పర్యావరణ పరంగా ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులు పెను సవాలుగా మారుతున్న నేపథ్యంలో పచ్చదనం పెంపు ప్రక్రియ నిరంతరం కొనసాగాలని అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సచివాలయంలో బుధవారం హరితనిధి విరాళాలు, వ్యయంపై మంత్రి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి దాకా హరితనిధి కింద వచ్చిన విరాళాలు, ఖర్చు వివరాలను అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్ ఎం.డోబ్రియల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 2021 లో మొదలైన హరితనిధి ద్వారా ఇప్పటి వరకు రూ.69.21 కోట్లు జమ అయ్యాయని వెల్లడించారు. ఇందులో రూ.43 కోట్ల మేరకు పనులు మంజూరు అయ్యాయని, రూ.29.39 కోట్లు విడుదల కాగా, రూ.18.72 కోట్ల పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు.



# మేడారంలో జనజాతర

## కన్నెపల్లిలో గుడిమెలిగే పండగ ప్రారంభం
## గిరి జాతరకు భారీగా తరలివస్తున్న భక్తజనం
## ఇకపై ఆన్ లైన్ లోనే నిలువెత్తు బంగారం సమర్పణ

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా మేడారంలోని కన్నెపల్లిలో బుధవారం గుడిమెలిగే పండుగ ప్రారంభమైంది. మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలో సారలమ్మ ఆలయాల్లో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడిమెలిగే పండుగతో మేడారం మహాజాతర ప్రారంభమవుతుందని పూజారులు తెలిపారు. గుడిమెలిగే పండుగలో భాగంగా సమ్మక్క, సారలమ్మ ఆలయాల పైకప్పులను గడ్డితో కప్పారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా మేడారం జాతరకు భక్తులు తండోపతండాలుగా తరలిరానున్నారు. భక్త జనసందోహంతో మేడారం సందడిగా మారనుంది. పెద్ద ఎత్తున్న బంగారాన్ని సమ్మక్క, సారలమ్మకు భక్తులు సమర్పిస్తుంటారు. ప్రభుత్వం కూడా సదుపాయాలు కల్పించి, భక్తులకు ఇబ్బదులు రాకుండా చేస్తోంది. సమ్మక్క, సారలమ్మ జాతర ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవంగా ఘనతను చాటుకోనుంది. ఉత్తరాదిలో జరిగే కుంభమేళాకు తీసిపోని విధంగా ప్రజలు ఈ జాతరను ఆరాధిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తజనులు పోటెత్తుతున్న తీరు చూస్తుంటే మేడారానికి ఉన్న ప్రత్యేకత వేరుగా చెప్పనక్కరలేదు. రెండేళ్లకు ఒకసారి వచ్చే జాతర కావడంతో పాటు తెలంగాణ గిరిజన జాతర కావడంతో ప్రపంచ గుర్తింపు దక్కింది..మేడారం ఉత్సవానికి జాతీయ హోదా రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. అందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటి నుంచే కృషి చేయాల్సి ఉంది. ప్రజల్లో ఎంతో భక్తి విశ్వాసం ఉంటే తప్ప ఈ జాతరకు ఇంతటి ఆదరణ దక్కదు. లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి నాలుగు రోజులపాటు గద్దెలను దర్శించుకుని అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తారు. అన్నింటికి మించి ప్రభుత్వం ఇక్కడ చేసిన ఏర్పాట్లు అమోఘం. ముఖ్యంగా మంత్రులు సీతక్క, కొండా సురేఖలు అన్నీ తామై అధికారులను నడిపిస్తున్నారు. మొక్కులు, పూజలతో మేడారం ఆధ్యాత్మిక వనంగా మారుతోంది.

### పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా..

మేడారం జాతర అభివృద్ధికి నిధులు కేటాయించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి సీతక్క అన్నారు. మేడారం జాతర ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాల కల్పనపై నిత్యం పర్యవేక్షణ చేస్తూ అధికారులను పురమాయిస్తున్నారు. జాతర పరిసరాల్లో ఉన్న రోడ్లను విస్తరించి భక్తులు ఎక్కడ కూడా ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. జాతర పరిసరాలను మరింత విస్తరింపజేసేందుకు అవసరమైన భూసేకరణ కూడా చేపట్టడానికి సుముఖత వ్యక్తం చేశారు. మేడారాన్ని కుంభమేళా తరహాలో తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. జాతరలో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మేడారం జాతర వరకు ఉన్న దారులను పూర్తిగా విస్తరింపజేస్తే భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. ఈసారి జాతరలో భక్తులకు తాగునీటి వసతి, టాయిలెట్స్‌ను పెద్ద మొత్తంలో ఏర్పాటు చేశామన్నారు. మేడారంలో కాలుష్యం లేకుండా పారిశుద్ధ్యం పనులు ఎప్పటికప్పుడు చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో జాతరను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మేడారాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం శాశ్వత పనులు చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు. జాతర నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించామని మంత్రి సీతక్క తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జాతరలో మరిన్ని శాశ్వత ఏర్పాట్లు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు.

# అగ్రం పహాడ్ జాతరకు హాజరుకండి

## సీపీని ఆహ్వానించిన పూజారులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈనెల 21నుంచి 24వ తేదీ వరకు ఆత్మకూరు మండలం అగ్రంపాడులో నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు రావాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను ఆలయ పూజారులు, అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లతోపాటు జాతరకు సంబంధించిన పోలీస్ బందోబస్తుపై పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్, ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అమ్మలను దర్శించుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిందిగా పోలీస్ కమిషనర్ సూచించారు. పోలీస్ కమిషనర్ ను ఆహ్వానించిన వారిలో ఆత్మకూర్ ఇన్స్పెక్టర్ రవి రాజ్, ఆలయ అధికారి శేషగిరి, పూజారులు సాంబశివ రావు, వెంకన్న, సారంగపాణి, భాస్కర్, విశ్వనాథ్, స్థానిక నాయకులు రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రెజ్లింగ్‌లో విజయకేతనం ఎగురవేయాలి

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతదేశ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీకైనా రెజ్లింగ్ క్రీడలో జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో బుధవారం తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-15, అండర్-20 రెజ్లింగ్ చాంపియన్ షిప్ ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ క్రీడలు స్నేహ భావానికి చిహ్నం అన్నారు. క్రీడల్లో భాగస్వాములైన యువత అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉందన్నారు. బాల్యం నుంచే తమకు ఆసక్తి ఉన్న ఏదైనా ఒక క్రీడారంగంలో చిన్నారులు శిక్షణ పొందాలన్నారు. క్రీడలతో క్రమశిక్షణ అలవర్చుకుంటూ ఉజ్వల భవిష్యత్ పొందవచ్చన్నారు. తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ అడాక్ కమిటీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశానుసారం రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు ఉచితంగా భోజన వసతి సౌకర్యం కల్పించడమే కాకుండా ఏ విధమైన ఎంట్రీ ఫీజు లేకుండా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్ ఖాన్ మాట్లాడుతూ భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేస్తున్న క్రీడ రెజ్లింగ్ అన్నారు. గత ఏడాదికాలంగా ఇబ్బందులు ఎదుర్కొన్న రెజ్లింగ్ క్రీడాకారులకు కొత్త రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెజ్లింగ్ క్రీడాభివృద్ధికి పూర్తిగా సహకరించనున్నట్లు చెప్పారు. తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు ఈ ఛాంపియన్ షిప్ లో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ పోటీలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెల 11 నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలను అతిథులు లాంఛనంగా ప్రారంభించారు. అతిథులను రాష్ట్ర రెజ్లింగ్ సంఘం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో శాట్స్ పరిశీలకులు, డీవైఎస్వో జి.అశోక్ కుమార్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ వరద రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, వరంగల్ జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి బి.కైలాసం యాదవ్, వివిధ జిల్లాల రెజ్లింగ్ సంఘాల బాధ్యులు ఎస్.రాజ్ కుమార్, జైపాల్, షేక్ రియాజ్, కాశీ హుస్సేన్, బి.సాయిలు, టి.శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంలపై అవగాహన అవసరం

## హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్నికలకు వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ( ఈవీఎంల) ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ లో రాబోయే లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం ప్రదర్శన కేంద్రం వద్ద అవగాహన కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈవీఎం పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ పనితీరు గురించి ఎన్నికల విభాగం అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓటు వేసినప్పుడు ఈవీఎం పనితీరు గురించి ప్రదర్శన కేంద్రం వద్ద పలువురికి ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వైవి.గణేష్, ట్రైనీ కలెక్టర్ శ్రద్దా శుక్లా, సామాజిక వేత్త ఇవి.శ్రీనివాస్ రావు, హనుమకొండ తహసీల్దార్ విజయ్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావు, అధికారులు సురేష్ కుమార్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com